సాక్షి
నిజామాబాద్

శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



కష్టపడ్డారు.. కొలువు..
జిల్లాకు చెందిన పలువురు గ్రూప్–1లో సత్తాచాటారు. ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కలలను నెరవేర్చారు.
- 10లో ▸



పార్థీ దొంగల ముఠా..
నేషనల్ హైవేలపై చోరీలు, దారిదోపిడీలకు పాల్పడుతున్న పార్థీ ముఠాలోని కొందరిపై పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.5 /22.9

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఆర్టీసీ ఆన్‌లైన్ రిజర్వేషన్

ఖలీల్‌వాడి: బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ టి.జ్యోత్స్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి రోజూ జేబీఎస్ నుంచి నిజామాబాద్ వరకు 15 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు, అలాగే తిరుగు ప్రయాణికులు 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చని ఆర్‌ఎం తెలిపారు. రీజియన్ పరిధిలోని ఆరు డిపోలు నిజామాబాద్ – 1,2, బోధన్, ఆర్మూర్, బాన్సువాడ, కామారెడ్డికి జెబీఎస్ నుంచి బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. అలాగే ఇతర ప్రధాన రూట్లలో సైతం అదనపు బస్సులు నడుస్తాయని, www.tg srtcbus.in వెబ్‌సైట్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కళాశాలల్లో టీచర్స్, పేరెంట్స్ మీటింగ్

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బోర్డ్ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించనున్న సమావేశాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు. అధ్యాపకులు నేర్పాల్సిన అంశాలను, సమస్యలను తల్లిదండ్రులు తెలుపాలని డీఐఈవో కోరారు. విద్యార్థుల హాజరు, విద్యాభ్యాసం, ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షల మార్కులను ఈ సమావేశంలో తల్లిదండ్రులకు వివరిస్తామని, తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

ఆగమాగం.. ఫైళ్లు మాయం

- నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పరిస్థితి
- స్లాట్ సమయం ఉదయం ఉన్నా.. సాయంత్రం వరకు ఆగాల్సిందే..
- మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్న గర్భిణులు, వృద్ధులు

నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పని అంటేనే ప్రజలు హడలెత్తుతున్నారు. అంతా గందరగోళ పరిస్థితి ఉంది. రిజిస్ట్రేషన్‌ల కోసం రోజంతా పడిగాపులు కాయాల్సి వస్తోంది. కూర్చునేందుకు కుర్చీలు, కనీసం తాగునీరు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు.



ఖాళీగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కుర్చీ



రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గురువారం వేచి ఉన్న జనాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అది నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయం.. కొత్తవారు ఎవరైనా వస్తే చేపల మార్కెట్టా.. లేక కొత్త సినిమా టిక్కెట్లు బ్లాక్‌లో అమ్ముతున్నారా..? అనే సందేహం కలుగక మానదు. ఇదే తరహా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గురువారం గందరగోళ వాతావరణం నెలకొంది. ఓ తొమ్మిది నెలల నిండు గర్భిణి రిజిస్ట్రేషన్ నిమిత్తం రాగా, ఉదయం 11 గంటలకు స్లాట్ ఇచ్చారు. సాయంత్రం 6.30 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేయలేదు. విచిత్రమేమిటంటే కంప్యూటర్ గదిలో ఎంట్రీ చేసే సిస్టమ్ వద్ద ఉన్న ఫైల్ మాయమైంది. కొన్ని గంటల పాటు వెతకగా చివరకు హాల్‌లో ఉన్న టేబుల్ మీద ఈ ఫైల్ దొరికింది. కార్యాలయంలో ఏ ఫైళ్లు ఎక్కడ ఉన్నాయో అనేది అర్థం కాని పరిస్థితి. నిండు గర్భిణి రిజిస్ట్రేషన్ నిమిత్తం బుధవారం కూడా రోజంతా అనేక ఇబ్బందులు కలిగినప్పటికీ వేచి చూసి వెళ్లారు. ఇలా రిజిస్ట్రేషన్ కోసం రెండ్రోజులుగా తిరుగుతున్నవారు చాలామంది ఉన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల పోటాపోటీ వ్యవహారంలో ఎవరి ఫైళ్లు వారు ముందు పెట్టుకోవాలనే పోట్లాడే పరిస్థితి నెలకొంది. కార్యాలయం మొత్తం డాక్యుమెంట్ రైటర్లదే హవా. దీంతో ఈ కార్యాలయంలో పనిచేసేందుకు సబ్ రిజిస్ట్రార్లు ముందుకు రావడం లేదు. ఏడాది కాలంగా ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు ఇన్‌చార్జి ఇచ్చారు. ఈ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లతో నెట్టుకొస్తున్నారు. అయితే ఇంత గందరగోళ పరిస్థితులు నెలకొన్న రోజు కార్యాలయంలో రిజిస్ట్రార్ ఒక్కరు మాత్రమే విధులు నిర్వహించారు. దీంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చినవారు రోజంతా వేచిచూడాల్సిన వచ్చింది. అంతకు ముందురోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వర్ పనిచేయలేదంటూ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయలేదు. వందల మందికి ఎదురు చూపులు తప్పలేదు. అయితే నిజామాబాద్ రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మాత్రం సర్వర్ పని చేయడం గమనార్హం. నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారాలకు సంబంధించి తాజా ఘటన ఒక ఉదాహరణ మాత్రమే.



వృద్ధుడి ఇబ్బందులు

అద్దె భవనంలోనే..

అత్యధిక ఆదాయం తీసుకొచ్చే రిజిస్ట్రేషన్ల విభాగానికి సంబంధించి సొంత కార్యాలయం ఏర్పాటు చేసే విషయంలో ప్రభుత్వం పట్టింపు లేకుండా వ్యవహరిస్తోంది. సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఏర్పాటు చేసి అందులోకి వివిధ ప్రభుత్వ కార్యాలయాలను తరలించారు. ఇలా తరలివెళ్లిన కార్యాలయాలకు సంబంధించి పలుచోట్ల పాత భవనాలు ఉన్నాయి. అయినప్పటికీ భారీగా అద్దెలు చెల్లిస్తూ తగిన సౌకర్యాలు లేని ప్రైవేటు భవనంలో నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ కార్యాలయాలు నడిపిస్తున్నారు. రెండో ఫ్లోర్‌లో ఉన్న అర్బన్ కార్యాలయానికి వచ్చేందుకు గర్భిణులు, వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుర్చీలు లేక గంటల తరబడి నిలబడుతున్నారు. మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కూడా సక్రమంగా లేవని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిని 'సాక్షి' సంప్రదించగా పరిశీలించి తగిన విధంగా పరిష్కారం చూపేందుకు ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు.

వైన్‌షాపులకు నేటి నుంచి దరఖాస్తులు

- జిల్లాలో 102 మద్యం షాపులు
- దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలు
- లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు
- 2023లో 4 వేల దరఖాస్తులు

జనాభా	లైసెన్స్ ఫీజు (రూ.లక్షల్లో)
5 వేల వరకు	50
5 వేల నుంచి 50 వేలు	55
50వేల నుంచి లక్ష వరకు	60
లక్ష నుంచి 5 లక్షల వరకు	65
5 లక్షల నుంచి 20 లక్షల వరకు	85



ఖలీల్‌వాడి : వైన్‌షాపుల లైసెన్సుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు ఎక్సైజ్ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. లక్కీ డ్రా ద్వారా దుకాణాలను కేటాయించి 2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30 కాలానికి లైసెన్స్‌లు కేటాయిస్తారు. ప్రస్తుతమున్న వైన్‌షాపులు నవంబర్ 30 వరకు కొనసాగనున్నాయి. కలెక్టర్ పర్యవేక్షణలో దుకాణాల కేటాయింపులో రిజర్వేషన్లను ఖరారు చేస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డి తెలిపారు.

జిల్లాలో 102 వైన్‌షాపులున్నాయి. గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్ ఉంటుంది. రూ.3 లక్షల డీడీ చెల్లించి దరఖాస్తు ఫారం పొందాల్సి ఉంటుంది. ఆరు శ్లాబుల్లో జనాభా ప్రాతిపదికన మద్యం షాపుల లైసెన్స్ ఫీజు ఉండనుంది. 2023లో 102 దుకాణాలకు మొత్తం 4 వేల దరఖాస్తులు రాగా, ఈ సారి 5 వేల వరకు వస్తాయని ఎక్సైజ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పకడ్బందీగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్

నిజామాబాద్‌అర్బన్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్లతో ఎస్ఐఆర్ అమలు కోసం చేస్తున్న కసరత్తు, ముందస్తు సన్నద్ధతపై సమీక్షించారు. 2002 ఓటరు జా బితాతో కొత్త ఓటరు జాబితాను జాగ్రత్తగా పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత నమూనాలో వివరాలు రూపొందించాలని తహసీల్దార్లకు సూచించారు. తప్పిదాలకు తావు లేకుండా కంట్రోల్ టేబుల్ మ్యాపింగ్, ఎలక్టోరల్ టేబుల్ మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. నిర్దిష్ట గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులన్ని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రోజంతా ముసురు

- ఎడతెరిపి లేకుండా కురిసిన వాన
- 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు
- ఓ వైపు మంజీర, గోదావరికి వరద.. మరోవైపు ముంపు భయం



ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వర్షం కురిసింది. రోజంతా ముసురు కురవగా, 2 సెంటీమీటర్ల వర్షంపాతం మాత్రమే నమోదైంది. జిల్లాలోని 10 మండలాల్లో సాధారణం కన్నా ఎక్కువ, 22 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మోపాల్ మండలంలో మాత్రం అతి తక్కువ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మెండోరా మండలంలో 8.4 మిల్లీమీటర్లు, డొంకేశ్వర్‌లో 7.5, మోర్తాడ్ 5.2, ముప్కాల్ 6.3, కమ్మర్‌పల్లి 7.9, బాల్కొండ 5.6, ఏర్గట్ల 5.6, ఆర్మూర్ మండలంలో 4.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

మహా వరద

ఎగువన ఉన్న మహారాష్ట్రతోపాటు మంజీర ద్వారా గోదావరిలోకి వరద పెరుగుతుండడంతో నది పరీవాహక ప్రాంతాలైన రెంజల్, నవీపేట మండలాల్లో పంటలు నీట మునుగుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. బోధన్ రెవెన్యూ డివిజన్‌లోని పొతంగల్, సాలూర, బోధన్ మండలాల్లో మంజీర వరదతో ముప్పు పొంచి ఉంది. మరో పది రోజుల్లో కోతకు రానున్న సోయా వర్షం, వరద కారణంగా దెబ్బతినే పరిస్థితి నెలకొంది.

గోదావరిలోకి తగ్గిన నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి గోదావరిలోకి అధికారులు గురువారం నీటి విడుదలను తగ్గించారు. బుధవారం 4 లక్షల క్యూసెక్కులను విడుదల చేసిన అధికారులు గురువారం 2 లక్షల క్యూసెక్కులకు తగ్గించారు. 39 వరద గేట్ల ద్వారా 2 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎగువ నుంచి 3 లక్షల 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఇన్ ఫ్లోతో ఎక్కువగా ఉండి, అవుట్ ఫ్లో తక్కువగా ఉండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. వరద కాలువ ద్వారా 5,834 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 5,500, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,500, సరస్వతి కాలువ ద్వారా 400, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 180 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా మిషన్‌భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఆవిరి రూపంలో 591 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం రాత్రి సమయానికి 1082.8000(52.8టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

పనితీరు మరింత మెరుగుపడాలి



ధర్పల్లిలో ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

ధర్పల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు మరింత మెరుగుపడాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ధర్పల్లి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం, తహసీల్ కార్యాలయాలను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీహెచ్‌సీ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. స్వస్థ్ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ భాగంగా సీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆరోగ్య శిబిరంలో స్పెషలిస్టు డాక్టర్లు అందుబాటులో ఉన్నారా అని పరిశీలించారు. శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అవసరం ఉన్న వారిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రిఫర్ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి, మండలంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న తీరును పరిశీలించారు. కొత్త ఓటరు జాబితాను జాగ్రత్తగా పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత నమూనాలో వివరాలు రూపొందించాలని తహసీల్దార్ శాంతకు సూచించారు. తప్పిదాలకు తావు లేకుండా కంట్రోల్ టేబుల్ మ్యాపింగ్, ఎలక్టోరల్ టేబుల్ మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు.

'రైతు డిక్లరేషన్' హామీలు నెరవేర్చాలి

- మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి
- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా వరంగల్ రైతు డిక్లరేషన్‌లో చెప్పిన ప్రకారం మొక్కజొన్న పంటకు మెరుగైన మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన వేల్పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు కొనుగోలుదారుల చేతుల్లో మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నందున ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు. క్వింటాలుకు రూ. 2400 ఉన్న మద్దతు ధరకు మెరుగైన మద్దతు ధర రూ. 400 కలిపి క్వింటాలుకు రూ. 2800 చెల్లించి కొనుగోలు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రూ. 2800 లకు మక్కలు కొనాలని, కానీ కొనుగోలు కేంద్రాలు లేక ప్రైవేటు వ్యాపారులు రూ. 1800కు కూడా కొనడం లేదన్నారు. వర్షాలు కురుస్తున్నందున వ్యాపారులు ధరను ఇంకా తగ్గించే అవకాశం ఉందన్నారు. దీంతో ఎకరానికి సుమారు 30 క్వింటాళ్ల మక్కలు పండించే రైతులు రూ. 30 వేలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామగ్రామాన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కోరారు. సోయాబీన్ పంట కూడా కోత దశలో ఉన్నందున కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ముందుగా ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్‌ను కోరారు. మొక్కజొన్నకు వచ్చిన పరిస్థితులు సోయాబీన్‌కు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.

ఏసీపీతో నేడు 'సాక్షి' ఫోన్‌ఇన్



దసరా సెలవుల్లో ఊరెళ్తున్నారా.. అయితే ఇళ్లు జాగ్రత్త ! చోరీలకు అవకాశం లేకుండా మీరు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసులకు సమాచారం ఇవ్వడం, ప్రయాణాల్లో బ్లాక్ స్పాట్స్ వద్ద, నైట్ జర్నీలో ఇబ్బందులు కలగకుండా సలహాలు, సూచనల కోసం సాక్షి నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్ రెడ్డితో ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. మీరు ఫోన్ చేసి సలహాలు పొందవచ్చు.

తేది : 26-09-2025 (శుక్రవారం)
సమయం: ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు..

ఫోన్ నం : 87126 59807
99484 03753

ఉద్యోగుల బతుకమ్మ సంబురం

జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంతోపాటు జిల్లా కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆయాశాఖల ఉద్యోగినులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లా జడ్జి జీవీఎం భారతలక్ష్మి న్యాయమూర్తులు, న్యాయవాదులతో కలిసి బతుకమ్మ ఆడారు. – నిజామాబాద్ అర్బన్/ నిజామాబాద్ లీగల్



జిల్లా కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ ఆడుతున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



కలెక్టరేట్‌లో ఉద్యోగినులతో కలిసి దాండియా ఆడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలి

జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన జేఏంకేపీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘాన్ని ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు గురువారం సందర్శించారు. ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు తమిళసెలివి, ప్రియాంక, రాజశేఖర్ పరిశ్రమను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిశ్రమల శాఖ సీనియర్ ఆఫీసర్ ప్రశాంత్, పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ పాట్కురి తిరుపతిరెడ్డి క్లస్టర్ గురించి శాస్త్రవేత్తలకు వివరించారు. రైతులు సంఘటితంగా ఉండి ఆధునిక పద్ధతిలో వ్యవసాయ రంగాన్ని తీసుకెళ్లడానికి అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సంతోష్, పుప్పాల నాగేశ్, సూపర్‌వైజర్ రుత్విక్ తదితరులు పాల్గొన్నారు.



పసుపు పరిశ్రమలో ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు

క్లుప్తంగా

వ్యవసాయ శాస్త్రవేత్తల క్షేత్ర సందర్శన



డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): రైతులు సాగు చేస్తున్న ఆర్‌డీఆర్‌–1200 రకం వరి పంటలను అగ్రికల్చర్‌ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పరిశీలించారు. క్షేత్ర సందర్శనలో భాగంగా గురువారం డొంకేశ్వర్‌ మండలం నూత్‌పల్లి గ్రామంలో పర్యటించి క్వాలిటీ సీడ్‌ విలేజ్‌ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో మాట్లాడి పంటల పెరుగుదల, వ్యాధుల నియంత్రణ, అధిక దిగుబడులపై సూచనలు చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన నాణ్యమైన విత్తనాలతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఇందులో శాస్త్రవేత్తలు రమ్య రాథోడ్‌, చంద్రకళ, ఏవో మధుసూదన్‌ ఉన్నారు.

ఆర్టీసీ 'లక్కీ డ్రా'

ఖలీల్‌వాడి: దసరా సందర్భంగా ప్రయాణికుల కోసం ఆర్టీసీ లక్కీడ్రా పథకాన్ని ప్రారంభించిందని నిజామాబాద్‌ డిపో–1 మేనేజర్‌ ఆనంద్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి అక్టోబర్‌ 6వ తేదీ వరకు పథకం అమలులో ఉంటుందన్నారు. ఆర్టీసీ సెమీ డీలక్స్‌, డీలక్స్‌, మెట్రో డీలక్స్‌, సూపర్‌ లగ్జరీ, లహరితోపాటు రాజధాని బస్సులలో ప్రయాణించే వారు టికెట్‌ వెనుకవైపు పేరు, ఫోన్‌ నెంబర్‌, చిరునామా రాసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన లక్కీ డ్రా బాక్సులలో వేయాలని తెలిపారు. అక్టోబర్‌ 8న ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయంలో డ్రా తీస్తామన్నారు. లక్కీ డ్రాలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేలు నగదు రూపంలో అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ ఎల్లారెడ్డి గ్రామంలో ఒకరు జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పుష్పరాజ్‌ తెలిపారు. గ్రామానికి చెందిన కుమ్మరి రాజయ్య (55) పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చూయించినా రోగం నయం కావడం లేదు. దీంతో జీవితంపై విరక్తితో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కష్టపడ్డారు.. కొలువు సాధించారు

- గ్రూప్‌–1 ఫలితాల్లో సత్తా చాటిన జిల్లావాసులు
- ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక

వారందరూ సామాన్య, మధ్యతరగతి, రైతు కుటుంబాలకు చెందిన యువతీయువకులు. అందరిదీ ఒకటే లక్ష్యం. తల్లిదండ్రుల కల నెరవేర్చడం. చిన్నతనం నుంచి క్రమశిక్షణతో చదువుకుంటూ ఒక్కో మెట్టు ప్రణాళికతో ఎక్కారు. వరుసగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్న వారు కొందరైతే.. మొదటి ప్రయత్నంలోనే ఉన్నత స్థాయి కొలువు పొందినవారు మరికొందరు. టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్‌–1 ఫలితాల్లో నిజామాబాద్‌ జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు విజయం సాధించారు. అత్యుత్తమ ఫలితాలతో ఉన్నత కొలువులకు ఎంపికయ్యారు.

జూనియర్‌ అసిస్టెంట్‌ టు ఏటీవోగా..

- గ్రూప్‌–1లో సత్తా చాటిన మిర్జాపురం దీప



మిర్జాపురం దీప

బోధన్‌టౌన్‌(బోధన్‌): బోధన్‌ కమర్షియల్‌ ట్యాక్స్‌ ఆఫీస్‌లో జూనియర్‌ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మిర్జాపురం దీప గ్రూప్‌–1 ఫలితాల్లో సత్తా చాటి అసిస్టెంట్‌ ట్రెజరీ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించింది. దీప బోధన్‌ పట్టణంలోని హరిజనవాడకు చెందిన మిర్జాపురం సుజాత రామకృష్ణ దంపతుల కూతురు. తల్లి మున్సిపల్‌ ఉద్యోగి కాగా, తండ్రి సామాజిక కార్యకర్త. దీప 1 నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాల, 6, 7 తరగతులు ప్రజ్ఞ పాఠశాల, 8 నుంచి 10వ తరగతి వరకు వంశీ హైస్కూల్‌లో చదివారు. ఇంటర్మీడియెట్‌ బోధన్‌లోని శ్రీ శిరిడీ సాయి మహిళా జూనియర్‌ కళాశాల, డిగ్రీ ఉషోదయ డిగ్రీ కళాశాల, నిజామాబాద్‌లోని నిశితా కళాశాలలో పీజీ పూర్తి చేశారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో చదువులో రాణిస్తూ వచ్చిన దీప, ఉద్యోగ సాధనలోనూ వెనుకడుగు వేయకుండా గ్రూప్‌–1 సాధించింది. కాగా, దీప గ్రూప్‌–2 పరీక్షలోనూ మెరుగైన ర్యాంకు సాధించి, ఇటీవలే ధ్రువపత్రాల పరిశీలనకు వెళ్లింది. 'అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకున్నాను. కష్టపడి చదివితే ఫలితం దక్కుతుందనే నమ్మకంతో ముందుకుసాగాను. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఎంతో అండగా నిలిచి ప్రోత్సహించారు. గ్రూప్‌–1 సాధించడం ఆనందంగా ఉంది' అని దీప సంతోషం వ్యక్తం చేశారు.

అసిస్టెంట్‌ ఆడిట్‌ ఆఫీసర్‌గా ఆనంద్‌కుమార్‌



నిజామాబాద్‌ నాగారం: ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న కసితో ఢిల్లీలో 6 అంకెల జీతం వదులుకొని మరీ ఐదేళ్ల కఠోరంగా శ్రమించాడు. ఫలితంగా వరుసగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్నారు. నిజామాబాద్‌ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్లూర్‌ గ్రామానికి చెందిన ఆనంద్‌– కరుణ కుమారుడు మాదరి ఆనంద్‌కుమార్‌. నిజాంసాగర్‌లో జవహర్‌ నవోదయ పాఠశాలలో 2003లో పదో తరగతి పూర్తిచేశారు. 2012లో హైదరాబాద్‌ నైపర్‌లో ఎంఫార్మసీ పూర్తి చేశారు. ఆ తర్వాత ఢిల్లీలో 7 సంవత్సరాలపాటు ప్రైవేట్‌ కంపెనీలో ఉద్యోగం చేశారు. ఐదేళ్ల క్రితం జిల్లాకు తిరిగి వచ్చిన ఆయన ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని భార్య తేజస్వీని(రెవెన్యూ శాఖలో ఆర్‌ఐ), ఏఆర్‌ఐ సంతోష్‌, రాయదాసు, హెచ్‌ఎం ఆనంద్‌, జీజీ కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ రంగరత్నం, దేవా ప్రదీప్‌కుమార్‌ సలహాలు, సూచనలు తీసుకున్నారు. ప్రణాళికాబద్ధంగా చదువుకొని గ్రూప్‌–1, 2, 3, 4 పరీక్షలు రాశారు. 2024 డిసెంబర్‌లో విడుదలైన గ్రూప్‌–4 ఫలితాల్లో వాణిజ్య పన్నుల శాఖ జూనియర్‌ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. గ్రూప్‌–2లో రాష్ట్రస్థాయి 5వ ర్యాంకు, గ్రూప్‌–3లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు వచ్చింది. తాజాగా విడుదల చేసిన గ్రూప్‌–1 ఫలితాల్లో స్టేట్‌ అసిస్టెంట్‌ ఆడిట్‌ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించారు. 'నన్ను అమ్మానాన్న, భార్య తేజస్వీని ప్రోత్సహించారు. కుటుంబసభ్యులు, సన్నిహితుల సలహాలు, సూచనలు ఎంతగానో ఉపయోగపడ్డాయి.' అని ఆనంద్‌ చెప్పారు.

తండ్రి కిరాణా వ్యాపారి.. కూతురు గ్రూప్‌–1 ఉద్యోగి



కోటగిరి శ్రీనిధి

నిజామాబాద్‌అర్బన్‌: తండ్రి కిరాణా షాప్‌ నిర్వాహకుడు. కొడుకు, కూతుళ్లను ఉన్నత ఉద్యోగాల్లో చూడాలని కలలు కన్నాడు. అందుకు అనుగుణంగానే కూతురు గ్రూప్‌–1 ఉద్యోగం సాధించి తండ్రి ఆశయాన్ని నిలబెట్టింది. మాక్లూర్‌ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన కోటగిరి శ్రీనిధి గ్రూప్‌–1 ఫలితాల్లో ఎంపీడీవోగా ఉద్యోగం సాధించింది. చిన్నప్పటి నుంచి శ్రీనిధికి సివిల్స్‌ సాధించాలనే పట్టుదల ఉండేది. దానికి అనుగుణంగానే తల్లిదండ్రులు కూడా ప్రోత్సాహించారు. తండ్రి నరేందర్‌ గ్రామంలో కిరాణాషాప్‌ నిర్వహిస్తుండగా తల్లి కృష్ణవేణి గృహిణి. పదో తరగతి వరకు గ్రామంలోని చదివిన శ్రీనిధి, ఇంటర్‌, డిగ్రీ హైదరాబాద్‌లో పూర్తి చేసింది. అనంతరం ఐఏఎస్‌ అకాడమీలో శిక్షణకు చేరింది. సివిల్స్‌ సాధించాలని లక్ష్యం పెట్టుకున్న ఆమె.. మొదటిసారిగా గ్రూప్‌–1 పరీక్ష రాసింది. నిధి ఎంపీడీవోగా ఉద్యోగం సాధించడంపై మామిడిపల్లి గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. 'తల్లిదండ్రుల ప్రోత్సాహమే నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చింది. వారి ఆశయాలకు అనుగుణంగా చదివాను. నన్ను ఎంతో కష్టపడి చదివించారు. సివిల్స్‌ సాధించే వరకు విశ్రమించను.' అని శ్రీనిధి చెబుతోంది.

టీచర్‌.. డీపీవో అయ్యాడు..



వినోద్‌

నిజామాబాద్‌అర్బన్‌: రెంజల్‌ మండల కేంద్రంలో ఉపాధ్యాయుడి(ఎస్జీటీ)గా విధులు నిర్వర్తిస్తున్న వినోద్‌ గ్రూప్‌–1 ఫలితాల్లో ప్రతిభచాటి జిల్లా పంచాయతీ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. నవీపేట మండలం కోస్లి గ్రామానికి చెందిన వినోద్‌ తండ్రి సాయిలు రెండేళ్ల క్రితం చనిపోగా, తల్లి భోజమ్మ, తమ్ముడు దీపక్‌ ఉన్నారు. వీరిది వ్యవసాయ కూలీల కుటుంబం. 2022 నుంచి వినోద్‌ గ్రూప్‌–1 ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఆన్‌లైన్‌లో చదువుకుంటూ సొంతగా ప్రిపరేషన్‌ కొనసాగించారు. మొదటి ప్రయత్నంలోనే డీపీవోగా ఎంపికయ్యారు. కాగా, వినోద్‌ ఇదివరకే గ్రూప్‌–2, గ్రూప్‌–3 పరీక్షల్లో మెరుగైన ర్యాంకు సాధించగా, ఫలితాలు వస్తే డిప్యూటీ తహసీల్దార్‌, సూపరింటెండెంట్‌ పోస్టులకు ఎంపికయ్యే అవకాశం ఉంది. 'చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టాలు, నష్టాలను ఎదుర్కొని పెరిగాను. వాటిని అడ్డుగా భావించకుండా సంకల్పంతో ముందుకు సాగాను. అందుకు తగ్గట్టుగా ప్రిపేర్‌ అయ్యి గ్రూప్‌–1 ఉద్యోగాన్ని సాధించాను.' అని వినోద్‌ హర్షం వ్యక్తం చేశారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..



ఆత్రేయబాబు


నిజామాబాద్‌అర్బన్‌/మోర్తాడ్‌(బాల్కొండ): గ్రూప్‌–1 ఫలితాల్లో భీమ్‌గల్‌ మండలం చేంగల్‌ వాసికి ఉద్యోగం లభించింది. నంబి శ్రీనివాస్‌, శ్రావణి దంపతులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరి కుమారుడు నంబి ఆత్రేయబాబు గ్రూప్‌–1 ఫలితాల్లో 461.5 మార్కులు సాధించి ఎంపీడీవో ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఆత్రేయ బాబు ప్రస్తుతం చెన్నైలోని ఎయిర్‌పోర్టు రీజినల్‌ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆర్మూర్‌లో పదో తరగతి, హైదరాబాద్‌లో ఇంటర్‌, ఇంజినీరింగ్‌ పూర్తిచేసిన ఆయన ఎయిర్‌పోర్టు ఆఫ్‌ ఇండియాలో ఉద్యోగం సాధించారు. అనంతరం తండ్రి సూచన మేరకు గ్రూప్‌–1 ఉద్యోగానికి ప్రిపేర్‌ అయ్యారు.

మొదటిసారిగా పరీక్ష రాయగా మెరుగైన మార్కులతో ఎంపీడీవో పోస్టుకు ఎంపికయ్యారు. 'తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించాను. గ్రూప్‌–1 ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది.' అని ఆత్రేయ బాబు తెలిపారు.

బల్దియా వార్డు ఆఫీసర్‌కు డీఎస్పీ అవకాశం

నిజామాబాద్‌సిటీ : తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ గ్రూప్‌–1 ఫలితాల ర్యాంకుల్లో నిజామాబాద్‌ నగరానికి చెందిన మున్సిపల్‌ వార్డు ఆఫీసర్‌కు డీఎస్పీగా అవకాశం దక్కనుంది. మున్సిపల్‌ కార్పొరేషన్‌లో వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రోజాబాయి గ్రూప్‌–1 ఫలితాల్లో 472 మార్కులతో 206వ ర్యాంక్‌ సాధించింది. మల్టీ జోన్‌–1 జనరల్‌ కోటాలో 6వ ర్యాంకు, మహిళల విభాగంలో 2వ ర్యాంక్‌ సాధించినట్లు తెలిపారు. ఇంటర్‌వరకు నగరంలోనే చదివిన రోజాబాయి బీఎస్సీ అగ్రికల్చరల్‌లో హైదరాబాద్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పూర్తిచేశారు. గ్రూప్‌–2లో 323 మార్కులు సాధించింది. రోజాబాయిని మున్సిపల్‌ కమిషనర్‌ దిలీప్‌కుమార్‌, అడిషనల్‌ కమిషనర్‌ రవీంద్ర సాగర్‌ తదితరులు అభినందించారు.

నవ నైవేద్యాల బతుకమ్మ



తొమ్మిదీ రోజులా లక్ష్మివే బతుకమ్మ
దండాలు మాయన్ని నీకివే బతుకమ్మ..
శంకరుని ఇల్లాల బృహదమ్మ నీవేగ
బతుకమ్మ పేరుతో వస్తివే బతుకమ్మ..
ఎంగిలీ పూలతో సంబురం తెస్తివీ
నువ్వులూ, నూకలూ నీకివే బతుకమ్మ..
ఆశ్వయుజ మాసానా అటుకులా వస్తివీ
సప్పిడీ, బెల్లమూ తీపివే బతుకమ్మ..
మూడవా రోజునా మెరిసేటి బొమ్మవే
పాలబువ్వ అందుకునె పాపవే బతుకమ్మ..
నాలుగో రోజునా కమ్మనీ పాయసం
అందించ వస్తిమీ తాగవే బతుకమ్మ..
చప్పట్ల జోరులో పాటలా హోరులో
అట్లనే నైవేద్యం తింటివే బతుకమ్మ..
పంచమీ రోజునా అలిగినా బొద్దెమ్మ
పస్తుంది నీక్కన్న ముట్టవే బతుకమ్మ..
నూకలా పిండినీ నేతిలో వేయించి
కమ్మటీ వేప్పల్లు నీకివే బతుకమ్మ..
ఎనిమిదో రోజునా వెన్నముద్దవమ్మా
నువ్వులా లడ్డూలు నీకివే బతుకమ్మ..
తొమ్మిదో రోజునా సద్దులా తల్లివే
బంగారి పూలతో సద్దివే బతుకమ్మ..
గంగమ్మ ఒడిలో సాగిపో హాయిగా
మరుయేడు శిశువులా మారవే బతుకమ్మ..
మరుయేడు శిశువులా మారవే బతుకమ్మ..



డొంకేశ్వర్‌(ఆర్మూర్‌):
రాసినవారు: సుజాత శేర్ల
– హిందీ టీచర్‌, జెడ్పీహెచ్‌ఎస్‌, మారంపల్లి (డొంకేశ్వర్‌)

ప్రకృతి మురిసేలా.. సంస్కృతి, సంప్రదాయానికి అద్దంపట్టేలా బతుకమ్మ పాట రాసే మహిళలకు ఇదే మా ఆహ్వానం. మీ పాటలను పంపాల్సిన వాట్సాప్‌ నంబర్‌
8332887332

ఎక్సైజ్‌ అసిస్టెంట్‌ సూపరింటెండెంట్‌గా..



కొండపల్లి గాయత్రి

కామారెడ్డి టౌన్‌: మున్సిపల్‌ పరిధిలోని దేవునిపల్లికి చెందిన కొండపల్లి గాయత్రి బీసీ సంక్షేమ శాఖలో జూనియర్‌ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. ఓ వైపు జాబ్‌ చేస్తూనే గ్రూప్‌–1కు పట్టుదలతో సన్నద్ధమైంది. ఆమె పట్టుదలకు విజయం వరించింది. గ్రూప్‌–1కు ఎంపికై ంది. మల్టీజోన్‌–1లో 201వ ర్యాంకు, మహిళా విభాగంలో 4వ ర్యాంకు సాధించింది. రెండు రోజుల క్రితం టీజీపీఎస్సీ గ్రూప్‌–1 తుది ఫలితాలు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఉద్యోగానికి ఎంపికైన గాయత్రి మాటల్లోనే...

మా నాన్న సీతారాములు ఆర్టీసీ కండక్టర్‌, అమ్మ రాజమణి ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. 7వ తరగతి వరకు రామారెడ్డిలో, 10వ తరగతి, ఇంటర్మీడియట్‌, డిగ్రీలో బీఎస్సీ, బీఇడీ జిల్లా కేంద్రంలో చదివాను. ఉస్మానియాలో ఎమ్మెస్సీ, ఎంఎల్‌ఐఎస్‌సీ పూర్తి చేశాను. 2020లో గ్రూప్‌–4కి ఎంపికై కామారెడ్డి బీసీ సంక్షేమ శాఖలో జూనియర్‌ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాను. డబుల్‌ పీజీ చదివి జూనియర్‌ అసిస్టెంట్‌గా ఎందుకమ్మా గ్రూప్‌–1 ప్రయత్నించి అధికారి కావొచ్చని తోటి ఉద్యోగులు చెప్పడంతో నేను అప్పటి నుంచి తీవ్రంగా ప్రయత్నించాను. సొంతంగా ప్రిపేర్‌ అయ్యాను. ఇటీవల గ్రూప్‌–1 ఫలితాల్లో నెగ్గాను. ఎక్సైజ్‌ శాఖలో అసిస్టెంట్‌ సూపరింటెండెంట్‌గా ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది.

తెరిపినివ్వని వాన.. అన్నదాత హైరానా



వన్నెల్‌ (కె)లో సోయా పంటలో నిలిచిన నీరు



కందకుర్తి శివారులో నీట మునిగిన చెరుకు పంట

నందిపేట్‌(ఆర్మూర్‌): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. నందిపేట మండలంలో భారీ వర్షంతో పొలాలు నీట మునిగి పంటలు దెబ్బతింటున్నాయి. నందిపేట, బజార్‌కొత్తూర్‌, మాయాపూర్‌, ఉమ్మెడ, బాద్గుణ, అయిలాపూర్‌, కంఠం, తల్వేద, చింరాజ్‌పల్లి గ్రామాలలో వరి పంట నేలకొరిగింది. సోయా పంటలు నీట మునిగాయి. మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. మరోవైపు నందిపేట మండల కేంద్రంలోని బర్కత్‌పుర, ఎన్‌టీఆర్‌నగర్‌ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, కాలువ కట్ట కాలనీలలో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఉదయం నుంచి జనజీవనం స్తంభించింది. మండలంలోని తల్వేద, మల్లారం, శాపూర్‌ గ్రామాలలోని చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి.

శాంతించని గోదారి..

రెంజల్‌(బోధన్‌): గోదావరి ఉగ్రరూపంతో ప్రవహిస్తోంది. రెండు రాష్ట్రాల మధ్య నదిపై నిర్మించిన అంతర్రాష్ట్ర వంతెన పైనుంచి వరద నీరు వస్తోంది. దీంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు రద్దయ్యాయి. స్థానిక రైతులు నది వైపు వెళ్లకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. గోదావరి పరీవాహక గ్రామాలైన కందకుర్తి, బోర్గాం, తాడ్‌బిలోలి గ్రామాల్లో వేలాది ఎకరాల సోయా, వరి పంటలు నీటమునిగాయి. ఆయా గ్రామాల్లో అధికారులు దండోరా వేయించి స్థానికులు నది వైపు వెళ్లకుండా అప్రమత్తం చేస్తున్నారు.

జేసీబీలో స్వామీజీలను తీసుకొచ్చిన అధికారులు

రెంజల్‌(బోధన్‌): కందకుర్తి పుష్కరక్షేత్రంలోని సీతారాం త్యాగి మహరాజ్‌ ఆశ్రమం చుట్టూ గోదావరి వరద నీరు చేరడంతో బుధవారం స్థానికుల సహకారంతో అధికారులు ట్రాక్టర్లలో వెళ్లి మహరాజ్‌ను గ్రామానికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. గురువారం తెల్లవారుజామున వరద కాస్త తగ్గుముఖం పట్టడంతో సీతారాం త్యాగి మహరాజ్‌తోపాటు ఆయన సోదరుడు తిరిగి వరద నీటిలోనే ఆశ్రమానికి కాలినడకన వెళ్లారు. వారు వెళ్లిన కొద్దిగంటల్లోనే వరద ఉధృతి పెరగడంతో ఎస్సై చంద్రమోహన్‌, తహసీల్దార్‌ శ్రావణ్‌కుమార్‌ గ్రామానికి చేరుకున్నారు. ట్రాక్టర్లు వెళ్లేందుకు కష్టంగా మారడంతో వెంటనే స్థానిక కాంగ్రెస్‌ నాయకుడు సిరాజ్‌బేగ్‌ పొక్లెయిన్‌(జేసీబీ)ని పిలిపించారు. ఎస్సై, తహసీల్దార్‌తోపాటు ఈత వచ్చిన కానిస్టేబుల్‌ ఒడ్డెన్న, మరికొందరు స్థానికులు ఆశ్రమానికి చేరుకొని స్వామీజీలను సురక్షితంగా గ్రామానికి తీసుకొచ్చారు. ఆశ్రమంలో 18 వరకు ఆవులు ఉన్నాయని, వాటికి మేత వేసేందుకు వెళ్లారని అధికారులు వివరించారు.

వర్షానికి కూలిన ఇళ్లు



బాల్కొండలో కూలిన ఇళ్లు

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో మేక లక్ష్మికి చెందిన ఇంటి గోడ కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పురాతన ఇళ్లు కావడంతో వర్షాలధాటికి దెబ్బతిని కూలింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు. కాగా, గురువారం ఉదయం నుంచి భారీ వర్షం కురువడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మక్క రైతులు ఆందోళన చెందుతున్నారు. మక్క కోతలు కోసి నూర్పిళ్లు చేసి రోడ్లపై ఆరబెట్టారు. కొందరు రైతులు మక్క కంకులను కుప్పలు చేసి పెట్టారు. ఏకధాటి వర్షాలతో కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఉంచారు. అయినా కంకులు తడిసి ముద్దవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రైం కార్నర్‌

పేకాడుతున్న 16 మంది అరెస్టు

వర్ని: మోస్రా మండల కేంద్రంలో గురువారం పేకాట స్థావరాలపై స్పెషల్‌ పార్టీ పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న 16 మందిని అరెస్టు చేసినట్లు వర్ని ఎస్సై మహేశ్‌ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ. 24,230 నగదు, 16 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారన్నారు.

నవీపేటలో ఎనిమిది మంది..

నవీపేట: మండలంలోని నాగేపూర్‌ శివారులో పేకాట స్థావరంపై బుధవారం రాత్రి దాడి చేసినట్లు ఎస్సై తిరుపతి గురువారం తెలిపారు. పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి రూ.8,430 నగదు స్వాధీనం చేసి, 8 సెల్‌ఫోన్లు, 6 బైక్‌లను సీజ్‌ చేశామన్నారు. ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పార్థీ దొంగల ముఠా సభ్యులపై పీడీ యాక్ట్‌



పార్థీ దొంగల ముఠా సభ్యులకు పీడీ యాక్టు ఉత్తర్వులు అందజేస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: జాతీయ రహదారులపై దొంగతనాలు, దారి దోపిడీలకు పాల్పడుతున్న పార్థీ దొంగల ముఠాకు చెందిన కొందరిని ఇటీవల కామారెడ్డి పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. ఈ ముఠాలోని ముగ్గురు ప్రధాన నిందితులపై పీడీ యాక్ట్‌ నమోదు చేసినట్లు ఎస్పీ రాజేశ్‌ చంద్ర గురువారం తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్‌, నిర్మల్‌ జిల్లాలలో రహదారుల వెంబడి, దాబా హోటళ్ల వద్ద నిలిపి ఉంచిన వాహనాలను టార్గెట్‌ చేసుకొని మారణాయుధాలతో దాడులు చేయడం, విలువైన వస్తువులు, నగదు దోచుకోవడం చేస్తుంటారు. అంతేకాకుండా జాతీయ రహదారుల వెంట ఉండే గ్రామాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను దోచేస్తారు. వీరిపై మహారాష్ట్రలోని ఉద్గిర్‌ నీలం పోలీస్‌ స్టేషన్‌ల పరిధిలో హత్య, హత్యాయత్నం కేసులు కూడా ఉన్నాయి. ముఠాలోని ప్రధాన నిందితులైన కర్ణాటక రాష్ట్రం బీదర్‌ జిల్లా ఔరాద్‌కు చెందిన కృష్ణ బాబు షిండే, మహారాష్ట్రలోని నాందేడ్‌ జిల్లా మంగ్యాల్‌ తడాకు చెందిన నాందేవ్‌, వసూర్‌ గ్రామానికి చెందిన రాథోడ్‌ అజిత్‌ రమేశ్‌పై పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పీడీ యాక్టు ఉత్తర్వులను నిజామాబాద్‌ జైలులో ఉన్న నిందితులకు అందజేశామన్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న ట్రావెల్స్‌ బస్సు

- 9 మందికి గాయాలు



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామం వద్ద 44వ నెంబర్‌ జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటైనర్‌ను ప్రైవేట్‌ ట్రావెల్స్‌ బస్సు ఢీకొన్న ఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌ నుంచి హైదరాబాద్‌కు 27 మంది ప్రయాణికులతో ప్రైవేట్‌ టావెల్స్‌ బస్సు బయల్దేరింది. మధ్యప్రదేశ్‌ నుంచి తమిళనాడుకు వెళుతున్న కంటైనర్‌ను డ్రైవర్‌ సుద్దపల్లి వద్ద రహదారిపై నిలిపి పక్కనే ఉన్న దుకాణానికి సరుకుల కోసం వెళ్లాడు. అదే సమయంలో ఆదిలాబాద్‌ నుంచి హైదరాబాద్‌ వెళ్తున్న ప్రైవేట్‌ ట్రావెల్స్‌ బస్సు కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టి అదుపుతప్పి డివైడర్‌ పైకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో ఎడమవైపు కూర్చున్న ప్రయాణికులు తొమ్మిది మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఫారుఖ్‌, రవీందర్‌, లింగమ్మ, అల్తాఫ్‌ ఉన్నారు. కంటైనర్‌ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.